నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 21 జూలై 2024 | NIZAMABAD


**రైతులకు రుణమాఫీ** తిప్పలు తప్పడం లేదు. పొద్దున లేస్తే బ్యాంకుల చుట్టూ తిరగడంతోనే సమయం గడిచిపోతున్నది. 18వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీలో పేరు రాని వారు, బ్యాంకుల్లో అప్పులు మాఫీ కాని వారంతా తీవ్ర ఆందోళనచెందుతున్నారు. తమకు ఎందుకు రుణమాఫీ వర్తించలేదంటూ వాకబు చేసేందుకు బ్యాంకులకు వరుస కడుతున్నారు. ఫోన్లకు మెస్సేజ్‌లు వచ్చిన వారంతా సంబుర పడుతుండగా రాని వారంతా నిట్టూరుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తుందని అందరూ చెప్పారని, రుణమాఫీ అవుతుందని కొండంత భరోసాతో ఉంటే నోట్లో మట్టి కొట్టారంటూ రైతులు బాధపడుతున్నారు. కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకొని కాంగ్రెస్ సర్కారు అమలు చేసిన రుణమాఫీతో క్షేత్రస్థాయిలో వేలాది మంది అర్హులైన రైతులకు మాఫీ వర్తించలేదు. దీంతో వారంతా విలవిల్లాడుతున్నారు. ఇదేం పద్ధతంటూ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుబడుతున్నారు. కేసీఆర్ హయాంలో తమకు రుణమాఫీ వచ్చిందని, ఇప్పుడు ఎందుకు రాదంటూ పలువురు గుర్తు చేసుకుంటూ బ్యాంకుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

–నిజామాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- కర్షకులకు తప్పని రుణమాఫీ తిప్పలు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.459కోట్లు మాఫీ
- సగానికి ఎక్కువ మంది రైతులకు మొండిచేయి
- కేసీఆర్ పరిపాలనలో రెండుసార్లు సాఫీగా రుణమాఫీ

# కొర్రీలతో.. కోత

## చెప్పిందొకటి.. చేసిందొకటి..





కోటగిరిలో బ్యాంకు వద్ద ప్రదర్శించిన రుణమాఫీ జాబితాను వర్షంలోనూ పరిశీలిస్తున్న రైతులు

**కల్లబొల్లి** మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన మాటను నెరవేర్చే క్రమంలో చాలా మంది అర్హులను పక్కన పెట్టింది. నిబంధనల పేరిట కొర్రీలు జతచేసి ఒక్కో గ్రామంలో చాలా మంది రైతులకు రుణ విముక్తి చేయకుండా మొండిచేయి చూపించింది. కేసీఆర్ హయాంలో మొదటిసారి రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో రూ. 1576 కోట్లు నిధులు వెచ్చించాల్సి వచ్చింది. రెండోసారి రుణాల రద్దుతోనూ ఏకంగా రూ.వెయ్యి కోట్లు మాఫీ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం కేవలం రూ.459కోట్లు మాత్రమే ఉమ్మడి జిల్లాలో రుణాలు మాఫీ అయ్యాయి. కేసీఆర్ చేసిన రుణమాఫీలో రేవంత్ రెడ్డి సర్కారు మాఫీ చేసిన రుణాలు చాలా స్వల్పమేనని గణాంకాలే చెబుతున్నాయి. 18వ తేదీన రుణమాఫీ తొలి విడుతలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 86వేల రైతు కుటుంబాలకే ప్రయోజనం జరిగింది. వాస్తవానికి రుణాలు తీసుకున్న వారి సంఖ్య లక్షల్లో ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలతో చాలా మంది నోట్లో మట్టి కొట్టినట్లయ్యింది. నిజామాబాద్ జిల్లాలో 4.14లక్షల కుటుంబాలకు రూ.225.62 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 4.52లక్షల కుటుంబాలకు రూ.235.61కోట్లు మాత్రమే రుణ విముక్తి జరిగింది.

**కేసీఆర్ హయాంలో సాఫీగా...**

కేసీఆర్ పాలనలో రెండుసార్లు రుణమాఫీ జరిగింది. పక్కాగా రైతులందరికీ రుణమాఫీని అమలుచేశారు. ఎలాంటి షరతులు విధించలేదు. వ్యవసాయ రుణాలు తీసుకున్న వారందరికీ స్వాంతన చేకూర్చారు. 2016లో తొలిసారి రుణమాఫీని కేసీఆర్ అమలుచేశారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో రూ.లక్షలోపు రుణం తీసుకున్న వారందరికీ మేలు జరిగింది. ఎంతమంది అర్హులుంటే అంతమందికీ రుణమాఫీ చేశారు. చెప్పింది చెప్పినట్లుగా చేసి చూపించారు. 2016లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 3లక్షల 79వేల 520 మంది రైతులకు లాభం చేకూరింది. ఇందుకోసం ప్రభుత్వం ఏకంగా రూ.1576 కోట్లు నిధులు వెచ్చించింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం కరోనా ద్వారా తలెత్తిన ఆర్థిక కష్టాలను పట్టించుకోకుండా ఇచ్చిన హామీని రైతుల కోసం కేసీఆర్ నెరవేర్చారు. 2018లో రెండోసారి రైతులకు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న లక్షా 95వేల 657 మందికి రూ.942 కోట్లు రుణమాఫీ చేశారు. కేసీఆర్ హయాంలో రెండుసార్లు జరిగిన రుణమాఫీ ద్వారా మొత్తం 5,75,177 మంది రైతులకు మేలు జరిగింది. ఇందుకోసం రూ.2,518కోట్లు కేసీఆర్ సర్కారు మంజూరు చేసింది.

### చెప్పలేక.. మింగలేక..

కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన రుణమాఫీతో సొంత పార్టీలోని కార్యకర్తలు సైతం తీవ్రంగా అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వ్యవసాయమే చేసుకుంటూ కాంగ్రెస్‌లో పనిచేసే వారిలోనూ సగానికి ఎక్కువ మందికి రుణమాఫీ వర్తించలేదు. పైగా వీరందరికీ గతంలో కేసీఆర్ అమలుచేసిన రుణమాఫీలో రెండుసార్లు లబ్ధి పొందిన వారున్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వం వస్తే లాభం జరుగుతుందంటూ ప్రచారం చేసి ఏకంగా వారే స్వయంగా దెబ్బతినడంపై చెప్పలేక మింగలేక అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పైకి మాత్రం నవ్వుకుంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా సంబురాల్లో పాల్గొంటున్నప్పటికీ లోలోపల రైతులను మోసం చేసిన తీరును చూసి సగటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుమిలిపోతున్న దృశ్యాలు సైతం పలు చోట్ల కనిపిస్తున్నాయి. రూ.లక్షలోపు రుణమాఫీకి షరతుల్లేకుండా అమలు చేస్తే బాగుండేదన్న అభిప్రాయం కాంగ్రెస్ పార్టీ నేతల్లోనూ ఏర్పడింది.

### నా లోన్ మాఫీ కాలేదు



ధర్పల్లి, జూలై 20: రామడ్గు సొసైటీ ఆధ్వర్యంలోని ధర్పల్లి ఎన్‌డీసీసీ బ్యాంకులో రుణం తీసుకున్నా. నా లోన్ రూ.లక్ష ఉన్నప్పటికీ జాబితాలో నా పేరు రాలేదు. లోన్ మాఫీ వస్తుందేమోనని జాబితాలో పేరు కోసం ఆతృతగా ఎదురు చూశాను. కానీ లిస్టులో నా పేరు రాకపోవడంతో బాధపడ్డాను. రెండో జాబితాలోనైనా నా పేరు వస్తుందో లేదోనన్న అనుమానం వస్తున్నది. ప్రభుత్వం ఒకేసారి ఎలాంటి కొర్రీలు లేకుండా వ్యవసాయం చేసుకునే రైతులందరికీ రుణమాఫీ చేస్తే బాగుంటుంది. మళ్లీ ఆ రుణమాఫీలో అసలు పోగా వడ్డీ మేమే కట్టాల్సిన పరిస్థితి వస్తున్నది. ప్రభుత్వం పూర్తి రుణమాఫీ చేయాలని కోరుకుంటున్నా.

**- సోమ శేఖర్, రైతు, మైలారం, ధర్పల్లి మండలం**

### సహకార సంఘంలో లోన్ తీసుకున్న..



శక్కర్‌నగర్, జూలై 20: ఎడపల్లి సహకార సంఘం ద్వారా రూ.25వేలు రుణం తీసుకున్నా. ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాల మాఫీని మొదటి దఫాలో ప్రకటించగా వచ్చిన లిస్టులో నాపేరు లేదు. రెన్యూవల్ చేయిస్తూ నిబంధనల మేరకు ఉండడంతో నాకు రుణమాఫీ వస్తుందని ఎదురు చూశా. ప్రభుత్వం పెట్టిన షరతులు, నిబంధనల మేరకు నేను రుణమాఫీకి అర్హుడినే. సహకార సంఘంలో అడిగితే, రుణమాఫీ రాని వారి లిస్ట్ తిరిగి పంపుతున్నామని అధికారులు చెబుతున్నారు. చిన్నపాటి రుణాన్ని మాఫీ చేయడంలో ఏం ఇబ్బంది జరిగిందో అధికారులే తెలపాలి.

**- పోల మల్లారెడ్డి, రైతు, ఎడపల్లి.**

### అన్నీ కరెక్టు ఉన్నా మాఫీ కాలేదు..



నేను జానకంపేట్ సహకార సంఘం ద్వారా రూ. 67 వేల రుణం తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించిన మొదటి లిస్టులో నా పేరు ఉంటుందని ఆశించా.. అయితే, మా సహకార సంఘంలో సగం మందికి పైగా రైతులకు రుణాలు మాఫీ కాలేదు. మొదటి విడుతలో మాఫీ జరగని మాలాంటి రైతులను, రెండోదఫా రూ.లక్షన్నర రుణమాఫీకి ముందే గుర్తించి, పథకం వర్తించేలా చూడాలి. రెండో దఫా అమలు చేస్తే, మొదటి విడతలో రుణమాఫీ జరగని మాకు అన్యాయం జరుగుతుంది. అందుకే రెండో విడుతకు ముందే మా సమస్య పరిష్కరించి న్యాయం చేయాలి.

**- డి.గంగాధర్, రైతు, జానకంపేట్.**

### రూ.80వేలు తీసుకున్న.. మాఫీ కాలేదు



డిచ్‌పల్లి, జూలై 20 : నేను బర్ధిపూర్ సొసైటీలో రూ.85వేల పంట రుణం తీసుకున్న. రెండు రోజుల క్రితం ప్రకటించిన రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. రూ.లక్ష లోపు ఉన్నా.. మాఫీ ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ చేయాలి. నాతోపాటు మా గ్రామంలో చాలా మందికి రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**- నీరడి సంధ్య, బర్ధిపూర్ గ్రామం, డిచ్‌పల్లి**

### నా పేరు లేదు.. ఏం చేయాలో...



కోటగిరి, జూలై 20 :నా పేరు వడ్ల శ్యాంకుమార్, నాకు కోటగిరి సమీపంలోని దా మర చెరువు కింద 18 గుంటలు పొలం ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వ హయంలో రూ.15వేలు రుణం తీసుకుంటే గతేడాది అక్టోబర్ లోనే మాఫీ అయ్యింది. తిరిగి కొత్తగా రూ.15వేలు పంటరుణం తీసుకున్న. కానీ ప్రభుత్వం మూడు రోజుల క్రితం ప్రకటించిన రుణ మాఫీ జాబితాలో నా పేరు రాలేదు. సంబంధిత శాఖ సిబ్బందిని అడిగితే రుణమాఫీలో పేరు రాలేదని సమాధానం చెప్పారు.

**- వడ్ల శ్యాంకుమార్, రైతు, కోటగిరి**

# అడ్డొస్తే కొట్టుడే..

- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వారిపై దాడులు
- ఒకరికి తీవ్రగాయాలు
- పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా
- అధికార పార్టీ నేతల అండతోనే దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు




బెజ్జోరా కప్పలవాగు నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, ఇసుక మాఫియా దాడిలో గాయపడిన కర్నే మహేందర్

భీమ్‌గల్,జూలై 20: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వారిపై ఇసుక మాఫియా దాడులకు పాల్పడిన ఘటన భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో చోటుచేసుకున్నది. శుక్రవారం అర్ధరాత్రి బెజ్జోరా కప్పల వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న సమయంలో అదే రోడ్డు గుండా ముచ్కూర్ నుంచి భీమ్‌గల్‌కు బీఆర్ఎస్ యూత్ నాయకులు కర్నే మహేందర్, అనిల్, నరేశ్ వస్తున్నారు. ఇసుక తరలిస్తున్న మద్దూరి భాస్కర్, శ్రీరాం రవి, రాజులకు చెందిన ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని ప్రశ్నించడంతో కొద్దిసేపు ఘర్షణ నెలకొన్నది. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో మద్దూరి భాస్కర్ పక్కనే ఉన్న పెద్ద కర్రను తీసుకొని కొట్టేందుకు ప్రయత్నించగా కర్నే మహేందర్ ప్రతిఘటించడంతో భాస్కర్ కిందపడిపోయాడు. కిందపడ్డ భాస్కర్ అక్కడే ఉన్న రాయితో మహేందర్ తలపై కొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో మహేందర్‌ను వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. డాక్టర్ వెంటనే చికిత్స చేసి తలకు ఆరు కుట్లు వేశారని మహేందర్ తెలిపారు.

**అక్రమ రవాణాను అడ్డుకుంటే దాడులే...**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మండలంలో ఇసుక అక్రమ రవాణా ముప్పై లారీలు, మూడు వందల ట్రాక్టర్లుగా కొనసాగుతున్నది. ఈ అక్రమ రవాణాను అడ్డుకుంటే దాడులకు కూడా వెనుకాడడం లేదు. తమకు ప్రభుత్వ పెద్దల అండ ఉందంటూ బహిరంగంగానే చెబుతున్నారంటే ఎంతలా విచ్చలవిడిగా కొనసాగుతున్నదో అర్థమవుతున్నది. ఈ వ్యవహారంపై మండలస్థాయి నుంచి మొదలుకొని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదు. మొక్కుబడిగా కొన్ని రోజుల వరకు బ్రేక్ ఇస్తున్నారే తప్పా.. అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి...**

ఇసుక అక్రమ రవాణాతో రాష్ట్ర ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వాటిల్లుతున్నది. ఈ దందాను మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలు అడ్డుకోకపోవడం శాఖల మధ్య సమన్వయ లో ప ం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. తమ పరిధిలోకి ఇసుక రాదం టూ తప్పించుకుంటున్నారని, దీంతో ఇసుక మాఫియాకు మరింత బలం చేకూరుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అక్రమ రవాణాను అడ్డుకునే వారిపై దాడులకు తెగబడుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా మైనింగ్ అధికారులను వివరణ కోరగా తమ పరిధిలోకి రాదని సమాధానం ఇవ్వడం గమనార్హం.

**పోలీసులకు ఫిర్యాదు..**

ఇసుక మాఫియా దాడిలో గాయపడిన కర్నే మహేందర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై దాడిచేసిన మద్దూరి భాస్కర్, శ్రీరాం రవి, రాజులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొన్న కర్నే మహేందర్‌ను బెజ్జోరా గ్రామానికి చెందిన మద్దూరి భాస్కర్, శ్రీరాం రవి, పిట్ల రాజు దాడికి పాల్పడ్డారని, మహేందర్‌ను చంపాలన్న ఉద్దేశంతో అక్కడ ఉన్న బండరాయితో కొట్టడంతో తీవ్రగాయాలపాలైయ్యాడని ఎస్సై హరిబాబు తెలిపారు. మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### అడ్డుకుంటే దాడులా..

దాడులను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. కర్నే మహేందర్‌కు అండగా ఉంటాం. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని తెలిసినా ఆ పార్టీ నేతలు అడ్డుకోవడం లేదంటే వారి కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనడానికి నిదర్శనం. ప్రజాపాలన అంటే ప్రజలపై దాడులా. **- దొన్కంటి నర్సయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు**

### దాడులను సహించేది లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లోనే ఇంతలా రెచ్చిపోతే.. మిగతా నాలుగున్నర ఏండ్లు ఎలా పాలిస్తారో ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెస్ ప్రజాపాలన అంటే అడ్డుచెప్పిన వారిపై దాడులేనా? **- ఆర్మూర్ మహేశ్, మాజీ ఎంపీపీ**



కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అంటేనే మహాశక్తి



ఆడపిల్లల రక్షణపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు, జిల్లా జడ్జి వరప్రసాద్, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ

- ఆశలు, అంగన్‌వాడీలది సామాజిక సేవ
- హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు

కామారెడ్డి రూరల్ , జూలై 20: స్త్రీ అంటే సామాన్య వ్యక్తి కాదని, మహాశక్తి అని హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. చైతన్యవంతమైన మహిళ ఉండే ఇల్లు ఆదర్శవంతంగా ఉంటుందని, ప్రపంచంలో భారతదేశానికి సముచిత స్థానం రావాలంటే మహిళల ద్వారా ఇంటి నుంచే రావాలన్నారు. మహిళా సాధికారత (నారీశక్తి)పై కామారెడ్డిలోని కళాభారతిలో జిల్లా న్యాయసేవా సాధికారత సంస్థ, మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా స్వయం సంఘాలకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహిస్తున్నది ఉద్యోగ బాధ్యతలు మాత్రమే కాదని, వారు చేసేది సామాజిక సేవ అని ప్రశంసించారు. భారత రాజ్యాంగం కుల, మత, లింగ, భాష తదితర భేద భావం లేకుండా పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలను కల్పించిందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళా సంక్షేమం కోసం అనేక చట్టాలు ఉన్నాయన్న హైకోర్టు న్యాయమూర్తి.. 1987లో తీసుకొచ్చిన న్యాయ సేవా సాధికార సంస్థ చట్టాల ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా అన్ని రకాల కేసుల్లో ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సిహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ, కామారెడ్డి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

# మైనర్లు బండి నడిపితే తల్లిదండ్రులకూ జైలు

- మైనర్లకు వాహనాలు ఇచ్చి శిక్షకు గురికావొద్దు
- జిల్లా జడ్జి సునీతా కుంచాల



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీతా కుంచాల, సీపీ కల్మేశ్వర్, కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని

కంఠేశ్వర్, జూలై 20: నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీతాకుంచాల అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, పోలీసు శాఖ సంయుక్తంగా మైనర్ డ్రైవింగ్– డ్రంకెన్ డ్రైవింగ్ అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ వారికుటుంబాలతోపాటు ఇతరులకు తీరని నష్టం చేకూరుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కఠిన చట్టాలు అమలులోకి తెచ్చిందని, మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులు నేరస్తులుగా పరిగణించబడతారని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారితోపాటు తల్లిదండ్రులకు మూడేండ్ల కారాగార శిక్ష, రూ.25వేల వరకు జరిమానా ఉంటుందన్నారు. సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాదిన్నర కాలంలో రోడ్డుప్రమాదాల్లో 550 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్, కారు నడిపే వారు విధిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ నిబంధనలు తప్పనిసరి చేస్తామని, ధరించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదస్సులో 7వ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు బస్వారెడ్డి, శ్రీనివాస్, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జీజీహెచ్ నుంచి బాలుడి కిడ్నాప్

- గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు
- బాలుడు క్షేమం.. పోలీసుల అదుపులో నిందితులు


బాబును ఎత్తుకెళ్తూ సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడు

వినాయక్‌నగర్, జూలై 20: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్)లో శనివారం తెల్లవారుజామున కిడ్నాప్‌నకు గురైన మూడేండ్ల బాలుడిని పోలీసులు గుర్తించారు. గంటల వ్యవధిలోనే కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండలం మానిక్‌బండార్ గ్రామానికి చెందిన సాయినాథ్ భార్య గర్భిణి కాగా, ప్రసవం కోసం ఆమెను ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. ఆమె డెలివరీ వార్డులో ఉండగా, సాయినాథ్ తన మూడేండ్ల కుమారుడు అరుణ్‌తో కలిసి శుక్రవారం రాత్రి దవాఖాన కారిడార్‌లో పడుకున్నాడు. శనివారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో వచ్చిన ఇద్దరు దుండగులు.. తండ్రి పక్కలో నిద్రిస్తున్న అరుణ్‌ని ఎత్తుకెళ్లారు. ఉదయం సాయినాథ్ లేచి చూడగా కొడుకు కనిపించకపోవడంతో దవాఖానలోని పోలీసు అవుట్ పోస్టు సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. వారు ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబుకు సమాచారమిచ్చారు. ఆయన వచ్చి దవాఖానలోని సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించగా, అగంతకులు బాబును భుజాన వేసుకొని వెళ్తున్నట్లు గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడి కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సీసీ పుటేజీను పరిశీలించిన పోలీసులు బాలుడిని కిడ్నాపర్లు మెట్‌పల్లి వైపు తీసుకువెళ్తున్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లారు. కిడ్నాపర్లను పట్టుకొని వారి నుంచి బాబును స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా కిడ్నాపర్లలో ఒకరి సోదరికి సంతానం లేకపోవడంతోనే బాబును కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు సమాచారం. కిడ్నాపర్లు జిల్లాకు చెందిన వారిగా తెలిసింది. పోలీసులు బాలుడిని మెట్‌పల్లి నుంచి నిజామాబాద్‌కు తీసుకువచ్చినట్లు, నిందితులను సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. గంటల వ్యవధిలోనే బాలుడి కిడ్నాప్ కేసును ఛేదించడంతో ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుతోపాటు ప్రత్యేక బృందాన్ని సీపీ అభినందించారు.